క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

కాచిగూడ: క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తే వారు మరింత ఉన్నతంగా రాణిస్తూ రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకువస్తారని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అన్నారు. ఆదివారం బర్కత్‌పురాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... టి20 ప్రపంచ కప్ క్రికెట్ విజేతలను ఆయా రాష్ట్రాల ముఖ్య మంత్రులు, ప్రభుత్వాలు సత్కరించి అభినందిస్తుంటే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయాలకు ప్రాధాన్యత ఇచ్చి భారత పేసర్ మహమ్మద్ సిరాజ్‌ను విస్మరించడం బాధాకరమని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం తక్షణమే తగు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. క్రీడల అభివృద్ధికి ప్రతి నియోజకవర్గంలో క్రీడా మైదనాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఆయా క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారు పతకాలు సాధించే విధంగా అవసరమైన శిక్షణా కార్యక్రమాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలన్నారు. క్రీడలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి క్రీడల అభివృద్ధికి కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన కోరారు. క్రీడలతోనే అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు వస్తుందని అన్నారు. బీసీ విద్యార్థి సంఘం నేతలు బలరామ్, మణికంఠ, వంశీ, యువరాజ్, ప్రవీణ్, ధరం, రుద్ర, శ్వేత, దీప్తి, రజిత, కోమలి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సర్వాయిపాపన్న విగ్రహాలను ఏర్పాటు చేయాలి


సమావేశంలో పాల్గొన్న గౌడ సంఘం సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గోల్కొండ కోటతో పాటు, ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలంగాణ గౌడ సేవా సమితి వ్యవస్థాపకుడు తౌలుపునూరి రమేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన తెలంగాణ గౌడ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షతన ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గౌడ కులస్తులు పాల్గొన్నారు. గోల్కొండ రాజైన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాలను గోల్కొండ కోటలో ఏర్పాటు చేయాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సమావేశం నిర్ణయించిందన్నారు. ఈ అంశంపై రాష్ట్రముఖ్యమంత్రి అనుమోలు రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిలను కలిసి వినతిపత్రాలు ఇవ్వాలని, వచ్చే నెల ఆగస్టు 18న సర్ధార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. అదే విధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలం, గ్రామాలలో సమితి ఆధ్వర్యంలో కొత్త కమిటీలు ఏర్పాటు చేసుకొని మరింత సేవాభావంతో ముందుకు వెళ్లాలన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో సమితి ప్రతినిధులు అరవింద్‌గౌడ్, నరేష్‌గౌడ్, రాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జగన్‌గౌడ్, రాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సాయిబాబాగౌడ్, రవివర్మగౌడ్, సత్యంగౌడ్, బాలరాజుగౌడ్, నాగరాజుగౌడ్, ఉదయ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా హరనాథ మహాప్రభు జయంతి


కుసుమ హరనాథులకు పూజలు నిర్వహించిన దృశ్యం


భజన చేస్తున్న హరనాథుల భక్తులు

నల్లకుంట: నల్లకుంట డివిన్ టీఆర్టీ కాలనీలోని శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆదివారం హరనాథ 159వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమం ప్రారంభం కాగా కుసుమ హరనాథులకు అర్ధ ఏకాహం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరనాథ భక్తులచే నిర్వహించిన 'జయహరనాథ జయకుసుమ కుమారి జయ' భజన ఆకట్టుకుంది. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం మంగళహారతితో జయంతి వేడుకలు ముగిసాయి. వేడుకల్లో హరనాథ ఆశ్రమ నిర్వాహకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి


స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కాచిగూడ: మహిళలు ఏదో ఒక రంగంలో నైపుణ్యం పెంపొందించుకుని ఆర్థికంగా పురోగతి సాధించాలని, మహిళలు ఎదిగినప్పుడే కుటుంబం, సమాజం బాగుంటుందని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్ మ్యాడం అంజయ్య హాల్‌లో వ్యాపార ఉత్పత్తుల స్టాల్స్ ఎగ్జిబిషన్, వంటల పోటీలను నిర్వహించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు స్టాల్స్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అందివచ్చిన అవకాశాలను పునికిపుచ్చుకోవాలన్నారు. ఎంచుకున్న రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పిల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రతి మహిళా స్వయంకృషితో ఆర్థికంగా ఎదగాలని అన్నారు. మహాసభ మహిళా కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు చామకూర సుజాత, అడ్వకేట్ అన్నపూర్ణ, ఆకుల మంజుల, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పన్నాల విష్ణువర్ధన్, ఎలగందుల దేవేందర్, అమరం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను విస్మరిస్తున్న కాంగ్రెస్


బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో గ్రేటర్ నేత శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచి పాలనను పట్టించుకోకుండా ముఖ్యమంత్రి, మంత్రులు పార్టీ ఫిరాయింపులకే పరిమితమయ్యారని బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నేత ఎం.ఎన్.శ్రీనివాస్‌రావు ఆరోపించారు. ఇతర పార్టీల ప్రజా ప్రతినిధులను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంలో ఉన్న శ్రద్ధ పాలనను చక్కదిద్దడంలో లేదని మండిపడ్డారు. ఆదివారం ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నగరంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపిస్తున్నాయని, పారిశుద్ధ్య సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారని అన్నారు. వర్షాలు కురుస్తూ రోగాలు ముసురుతున్నా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం లేదని, నగరంలో హత్యలు, అధికమయ్యాయని, సీఎంకు పాలనపై పట్టులేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చడం లేదని, నిరుద్యోగులు రోడ్డెక్కి ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందని ఆరోపించారు. పార్టీలు మారే నాయకులతో వచ్చే బీఆర్ఎస్‌కు వచ్చే నష్టం ఏమి లేదన్నారు. ప్రజాదరణ కోల్పోయిన వారే కాంగ్రెస్‌లో చేరుతున్నారని, అలాంటి వారితో కాంగ్రెస్ మునిగిపోవడం ఖాయమన్నారు. పార్టీ ఫిరాయింపులు మాని కాంగ్రెస్ పెద్దలు పాలనను గాడిలో పెట్టాలని హితవు పలికారు. బీఆర్ఎస్ నాయకులు రజనీకాంత్‌గౌడ్, ముప్పిడి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలి


కృష్ణాగౌడ్‌ను సన్మానిస్తున్న లక్ష్మణ్‌యాదవ్

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అంబర్‌పేటకు చెందిన తౌలుపునూరి కృష్ణాగౌడ్ నియామకమైన సందర్భంగా ఆదివారం పార్టీ నేతలు ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి అర్హులైన పేద ప్రజలకు అందేలా కృషి చేయాలని అన్నారు. పీసీసీ కార్యదర్శి లకుపతి యాదగిరి గౌడ్, లేబర్‌బోర్డు మాజీ చైర్మన్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

టీయూసీఐ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి సంజయ్ సింఘ్వీ



మాట్లాడుతున్న సంజయ్ సింఘ్వీ

ముషీరాబాద్: కార్మిక హక్కుల రక్షణకై, నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకంగా పోరాడడానికి కార్మిక సంఘాల ఐక్యత చాలా అవసరమని టీయూసీఐ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి సంజయ్ సింఘ్వీ అన్నారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) తెలంగాణ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం మార్క్స్ భవన్‌లో ఆదివారం జరిగింది. దేశంలో కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపైన సుదీర్ఘ చర్చ జరిగింది. ముఖ్య అతిథిగా టీయూసీఐ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి సంజయ్ సింఘ్వీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్లని దేశంలో ప్రవేశపెట్టే ప్రయత్నంలో ఉందన్నారు. దీనిని ప్రతిఘటిస్తూ కార్మికులు ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా కార్మికుల జీవన ప్రమాణాలు నేడున్న ధరలకు అనుగుణంగా లేని స్థితి వల్ల, దేశంలో రోజు రోజుకూ ధనికులు పెరిగిపోతున్న సందర్భంగా కార్మికవర్గం అధోగతిలో, కష్టాలతో జీవిస్తున్నారన్నారు. కార్మికులకు పని గంటలు పెంపుదల, వేతనాల చెల్లింపు, గ్రాట్యూటీ, పీఎఫ్ తదితర సామాజిక భద్రత చట్టాలను దేశంలో అసంఘటితరంగ కార్మికులకు అమలు కావట్లేదని, దీనికై ఉద్యమించాలన్నారు.

◆ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐఎఫ్‌టీయూ–టీయూసీఐల మధ్య ఐక్యతకు సంబంధించిన ప్రాథమిక చర్చలు నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎల్. పద్మ, ఎం.నరేందర్, ఎం.హన్మేశ్, సహాయ కార్యదర్శులు కె.రాజన్న, జి.రామయ్య, వెంకటేష్, రవి పాల్గొన్నారు.

కాచిగూడ ఇన్‌స్పెక్టర్‌గా చంద్రకుమార్



కాచిగూడ: కాచిగూడ ఇన్‌స్పెక్టర్‌గా కె.చంద్రకుమార్ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. 1996వ బ్యాచ్‌కు చెందిన చంద్రకుమార్ ఇప్పటి వరకు సౌత్‌జోన్ ఎస్‌బీలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర కుమార్ మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమన్నారు. చట్ట పరిధిలో ఏవైనా సమస్యలుంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వచ్చే బోనాల వేడుకలను ప్రజలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా కృషి చేయనున్నట్లు తెలిపారు.

ఏఐసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా గిడియోన్‌బాబు


ఏఐసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకపత్రం అందుకుంటున్న గిడియోన్‌బాబు

ముషీరాబాద్: ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా గిడియోన్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం చిక్కడపల్లిలో జరిగిన సమావేశంలో ఏఐసీఎఫ్ తెలంగాణ రాష్ట్ర శాఖ కమిటీ ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా బిషప్ జి.శామ్యూల్‌జాన్, కోశాధికారిగా పి.సోలమాన్‌రాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎస్.అబ్రహం, ఉపాధ్యక్షులుగా ఎన్.ప్రదీప్, బిషప్ ఎం.ఎస్.దయానంద్, బి.దైవసహాయం, ఉప కార్యదర్శిగా వనితా అలెగ్జాండర్, సహాయ కార్యదర్శులుగా రెవజాన్ సుందర్‌రాజ్, కృపాకర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పాస్టర్ కె.ప్రభాకర్, ఎం.వందనం, పాస్టర్ జిల్లా శాంతికుమార్ ఎన్నికయ్యారు.

ఎస్ఐ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

కాచిగూడ: దళిత ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... కులం వేధింపుల కారణంగానే అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ మృతి చెందాడని ఆరోపించారు. పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది తనను నిత్యం కులం వేదింపులకు గురిచేస్తూ మానసికంగా హింసిస్తున్నారని జిల్లా ఎస్పీకి, రాష్ట్ర డీజీపీకి మృతుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఎస్ఐ మృతికి కారణమైన స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జితేందర్‌రెడ్డి, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బీరం సతీష్ కుమార్, ఎం.ప్రవీణ్, ఇటికాల గణేష్ పాల్గొన్నారు.

జీవో నం:6ను రద్దు చేయాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గంగపుత్రుల జీవనోపాధిని దెబ్బతీసే జీవో నంబర్ 6ను సత్వరం రద్దు చేయాలని గంగపుత్రుల అభివృద్ధి సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో సంఘం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పార్లమెంటు విభాగం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక సంఘం అధ్యక్షుడు కె.సత్యనారాయణ మాట్లాడుతూ... గంగపుత్రులు ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో తమ సంఘానికి కేటాయించిన స్థలంలో ఆత్మగౌరవ భవన నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నేతలు పల్లెర్ల శంకర్, గుండు ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'ఆ పాత సుమధురాలు'


కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

ముషీరాబాద్: అన్నమయ్య కళా సమితి ఫౌండర్ గండేపల్లి సుమలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఆ పాత సుమధురాలు పాటల కార్యక్రమం ఆహూతులను అలరించింది. ఇప్పటి వరకు అన్నమయ్య కీర్తనలు మాత్రమే ఆలపించే చిన్నారులు ఇప్పుడు సరికొత్తగా సుమాస్ మ్యూజిక్ అకాడమీ అని పేరుతో చేపట్టిన కార్యక్రమంలో సినీ గీతాలతో అలరించారు. దాదాపు 15 మంది చిన్నారులు బి.ముక్త, బి.ధాత్రి, ఎం.అచ్యుత, పి.కృష్ణ, ఎస్.మాన్య, పి.అభిజిత్ కార్తికేయ, కె.సాయిశ్రేష్ఠి, టి.సాయివైభవి, పి.విశ్వతేజారావు, ఇ.రిషిత, కె.నాగలక్ష్మి, పి.పర్ణిక, ఐ.సాధ్వి, రేఖాతన్వి, కె.అక్షయ, యశోజ్ఞలు పాల్గొని అలనాటి సుమధుర గీతాలు వేణు గానమ్ము వినిపించేనే, పాండుతా తీయగా, బుచాడమ్మ బూచాడు, పగలే వెన్నెల, ఖుషీ ఖుషీగా నవ్వుతూ, నీవు లేక వీణా, చదువురాని వాడవని పాడి వీక్షకులకు వీనులవిందు చేశారు. వి.జీవన్, స్వర వీణపాణి, పి.రవివర్మ, పి.గిరిధర్రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం సీపీఎం బస్తీబాట


సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నేతలు

కాచిగూడ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం బస్తీ బాట నిర్వహిస్తున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మహేందర్ తెలిపారు. ఆదివారం సీపీఎం అంబర్‌పేట జోన్ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ కుంట, గంగాబౌలి, మల్లన్న గుడి, తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా ఇంతవరకు ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదని అన్నారు. మహిళలకు ఆర్టీసీ ఫ్రీ బస్సు మినహాయిస్తే మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు రూ. 2500, ఉచిత విద్యుత్, రూ. 500లకే సబ్సిడీ గ్యాస్, కల్యాణలక్ష్మి, వృద్ధులకు రూ. 4 వేలు పెన్షన్, దివ్యాంగులుకు రూ. 6 వేలు ఫెన్సన్ ఏవీ అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను పూర్తి స్థాయిలో ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నేతలు జి.రాములు, బి.సుబ్బారావు, శ్రీనివాస్, మల్లికార్జున్, గోపి తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యా పథకం నిధులు మంజూరు చేయాలి


సీఎంకు పోస్టుకార్డుల ద్వారా విజ్ఞప్తి చేస్తున్న బ్రాహ్మిణ్ బీబీఎన్ ప్రతినిధులు

కాచిగూడ: విదేశీ విద్యా పథకం నిధులను వెంటనే మంజూరు చేసి విద్యార్థులను ఆదుకోవాలని బ్రాహ్మిణ్ బిజినెస్ నెట్‌వర్క్ చైర్మన్ సముంద్రాల వేణుగోపాల్ చారి, జనరల్ సెక్రటరీ విక్రమ్, వి.ఎస్.మూర్తి, నెప్పల్లి శశిధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విదేశీ విద్యా పథకం నిధులు మంజూరు చేయాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పోస్టుకార్డులను పంపించి పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో వివేకానంద విదేశీ విద్యా పథకం ద్వారా సాంక్షన్ లెటర్స్ పొంది సంవత్సరం కావస్తున్నా నిధులు మంజూరుకాక పోవడంతో వందలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి తమ పిల్లలను విదేశాలకు పంపించారని, విద్య కోసం విదేశాలకు వెళ్లిన విద్యార్థులు అక్కడ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ లోన్లు యధావిధిగా కొనసాగించాలన్నారు. విదేశాలకు ఉన్నత చదువులకు పంపిన విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదనను అర్థం చేసుకొని వెంటనే నిధులు విడుదలకు ఆదేశాలు జారీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాంనగర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జీ గజ్జల రాజశేఖర్‌మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గండి కృష్ణమాదిగ ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల ప్రస్థావనలో ఎస్సీ వర్గీకరణ, ఆరోగ్యశ్రీ, పెన్షన్ పెంపు, ఉద్యోగ ప్రమోషన్ రిజర్వేషన్, అనాథ పిల్లల హక్కుల సాధన, ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రతిష్టం, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, రేషన్ పెంపు, ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలు సాధించిన ఘనత ఎమ్మార్పీఎస్‌కు ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ 60వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. రాంనగర్ చౌరస్తాలో కేక్‌కట్ చేసి వేడుకలు జరుపుకొన్నారు. ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సాంసంగ్ రాజుమాదిగ, డివిజన్ అధ్యక్షుడు రోషన్ వినయ్‌రావు మాదిగ, చలక ఎల్లయ్యమాదిగ, లక్ష్యంగళ్ల నర్సింహారావుమాదిగ, సిద్ధంకి దుర్గాప్రసాద్‌మాదిగ, యమడాల రాజుమాదిగ, కలవాలా కుమారస్వామిమాదిగ, గడ్డం రమేష్‌మాదిగ, కత్తి నర్సింగ్‌రావుమాదిగ, అమ్మగూడెం దశరథ్‌మాదిగ, అశోక్‌మాదిగ, సురేష్‌మాదదిగ, శంకర్‌మాదిగ, సాయిలు మాదిగ, శ్రీకాంత్‌మాదిగ, మహేష్‌కుమార్ మాదిగ, నాగేష్‌మాదిగ, శ్రీధర్‌మాదిగ, రాజుమాదిగ తదితరులు పాల్గొన్నారు.


రాంనగర్ చౌరస్తాలో ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదర్శ దంపతుల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కులాంతర, మతాంతర వివాహ దంపతులకు అభ్యుదయ ఆదర్శ దంపతుల పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ఆల్ ది బెస్ట్ అకాడమీ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఇ.ఎస్.ఎస్.నారాయణ వివరించారు. అభ్యుదయ ఆదర్శ దంపతులకు పురస్కారాలను అందించి సత్కరించాలనే సంకల్పంతో కులాంతర, మతాంతర వివాహం చేసుకున్న 60 జంటలను సత్కరించ బోతున్నామన్నారు. ఆసక్తి కలిగిన అర్హులైన వారు జూలై 10లోగా దంపతుల ఫొటో, వివాహ తేదీ వివరాలు ఫోన్: 96523 47207లో పంపాలన్నారు. సమాజ వికాసానికి, కులరహిత, మతరహిత వనసమాజ నిర్మాణం కోసం కులాంతర, మతాంతర, వరకట్న వ్యతిరేక ఆదర్శ వివాహం చేసుకున్న దంపతులను ప్రోత్సహించి నేటి సమాజంలో వారికి సముచిత గౌరవం గుర్తింపు ఇవ్వాలనే మంచి ఆశయంతో ఈ పురస్కారాలను ఇవ్వబోతున్నట్లు వివరించారు.

సివిల్స్ పరీక్షల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: నార్త్ అమెరికా పద్మశాలీ అసోసియేషన్, అఖిల భారత పద్మశాలీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో యూపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్, మెయిన్స్ ఎగ్జామినేషన్ -2024 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అడ్వయిజర్ సామల ప్రదీప్, పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి తెలిపారు. ఆదివారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... సివిల్స్ చదివే పద్మశాలీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు శిక్షణ పొందేందుకు కావలసిన ఆర్థిక సహకారాన్ని, మార్గదర్శకం అందించడానికి ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పద్మశాలీ సేవా సంఘం సికింద్రాబాద్ ఆధ్వర్యంలో యూపీఎస్‌సీ మెయిన్స్-2024 పరీక్షకు ఎంపికైన కొంతమంది అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య, కొక్కుల దేవేందర్, అవ్వారి భాస్కర్, నక్క వేణుమాధవ్, మాచర్ల రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర


జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ పావని

ముషీరాబాద్: జవహర్‌నగర్‌లో జగన్నాథ రథయాత్రను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథయాత్రకు కార్పొరేటర్ పావని ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్, నేతలు సంయుక్తారాణి, ఆకుల సురేందర్, సత్యం, ఆనంద్‌రావు, గణేష్, సాయి, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

సంఘర్ జాతి సంఘ్ నూతన కమిటీ



నల్లకుంట: సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం నల్లకుంట నర్సింహబస్తీలోని బస్తీ కమ్యూనిటీ హాల్ ప్రశాంతంగా ముగిశాయి. సంఘర్ జాతి సంఘ్ అధ్యక్షుడిగా కె.లక్ష్మణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా పి.నర్సింగ్ రావు, కోశాధికారిగా కె. లక్ష్మణ్ ప్రసాద్‌లు గెలుపొందారని ఎన్నికల అధికారి రమేష్ ప్రకటించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎం.బి.కిశోర్ కుమార్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజే. బాబు, సంఘర్ జాతి సంఘ్ సమితి సభ్యులు తదితరులు సంఘ్ నూతనంగా ఎన్నికైన వాళ్లను సత్కరించి ఊరేగించారు.

జూలై 7ను మాదిగ అమరవీరుల సంస్మరణ దినంగా ప్రకటించాలి



కవాడిగూడ: జూలై 7వ తేదీని ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన మాదిగ అమర వీరుల సంస్మరణ దినంగా ప్రకటించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు దన్ను కనకరాజు మాదిగ, తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటిక రాజు మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలంగాణ మాదిగ హక్కుల దండోర, తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్ 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలనే పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన మాదిగ అమర వీరులకు నివాళులర్పించారు. నేతలు సురేష్, దానయ్య, కృష్ణ, శ్రీకాంత్, నల్ల శివ, ఇటిక గోపి పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ ధర్నా

కావాడిగూడ: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పాలస్తీనాకు మద్దతుగా నిలబడదాం- ప్రపంచ శాంతికి పోరాడుదాం అనే అంశంపై ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఆదివారం ధర్నా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే యాదవరెడ్డి అధ్యక్షత వహించగా ఆప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ స్వాగతం పలికారు. ధర్నాకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరవ్వగా, అతిథులుగా టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్, రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ఇండియన్ అసోషియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, ఐప్సో అధ్యక్ష వర్గం సభ్యులు రఘుపాల్, ప్రజా కళాకారిణి విమలక్క తదితరులు ప్రసంగించారు.